# జీవచ్ఛవం

ముఖంచూసి మనిషి ఎలాంటివాడో చెప్పెయ్యొచ్చునంటారు కొందరు. కాదు మనిషి చింకిచొక్కా తొడిగినా, చేతిలో ఓ మంచి పుస్తకం ఉంటే, అతనెటువంటి సంస్కార హృదయుడో చెప్పెయ్యొచ్చునంటారు కందుకూరి వీరేశలింగం పంతులుగారు.

నేను పంతులుగారితోనే ఏకీభవిస్తాను. నేను ప్రయాణిస్తున్న స్లీపర్ క్లాస్‌లో నా ఎదురుగా ఓ ప్రయాణికుడున్నాడు. అతని తొడమీద ఓ పదేళ్ల పాప నిదురిస్తోంది. అతని చేతుల్లో మహాకవు గురజాడ, సంస్కరణశీలి కందుకూరి రచించిన పుస్తకాలున్నాయి. దాన్నిబట్టి ఆ ప్రయాణికుడు సంస్కరణాభిలాషి అని, సచ్ఛీలుడని తెలుస్తూనే ఉంది.

నేను మరి ఉండలేకపోయాను. అటువంటి సద్వర్తనునితో పరిచయం చేసుకోకపోవడం నిజంగా 'అవివేకానందస్వామి' లక్షణమే!

"నమస్కారమండీ! మీ పేరు తెలుసుకోవచ్చా?" అనడిగాను.

"విద్యాధరం" అన్నాడు వినమ్రంగా.

"ఏ ఊరెళుతున్నారు?"

"సికిందరాబాద్".

"బయలుదేరడం ఎక్కణ్నుంచి?"

"రాజమహేంద్రి".

"అక్కడెవరున్నారు?"

"ఇదిగో, ఈ పాప. అక్కడ ఓ గురుకులంలో చదువుతోంది. వేలవులిచ్చారు

సెలవపలిచ్చారు కదా! ఇంటికి తీసుకెళుతున్నాను!" అన్నాడతను.

ఇక్కడే చిన్నసందేహం కలిగింది నాకు. ఈ పాప అన్నాడేమిటీయన? మాపాప అనలేదేం? ఈ పాప తన పాప కాదా?

"క్షమించండి! ఇది మీ వ్యక్తిగత విషయం అనుకోండి. ఈ పాప తల్లీతండ్రీ..." అని నేను వాక్యం ముగించకుండానే, అతనందుకుని - "ఈ పాప తల్లి నా భార్య! సికిందరాబాద్‌లో ఉంటున్నాం" అన్నాడు.

ఈ పాప తల్లి అతని భార్య అయితే, తండ్రి కూడా తనే అవ్వాలి కదా?

"మీరేమీ అనుకోనంటే అడుగుతాను. మీ కుటుంబ విషయాలు తెలుసుకోవచ్చా?" అన్నాను.

"ఓ తప్పకుండా! అసలు మా కుటుంబ విషయాలు తెలుసుకోవడం చాలా అవసరం అన్నాడతను".

తనపక్క కూర్చున్న ప్రయాణికులు, నా పక్క కూర్చున్న ప్రయాణికులు ఆసక్తితో కళ్లు పెద్దవిచేసి చెవులు రిక్కించారు.

"నా భార్య - అంటే నాకు భార్య కాకముందు ఒకవ్యక్తిని ప్రేమించింది. పెళ్లి చేసుకుంటానని ప్రమాణాలు చేశాడు. నవలా రచయితలు, తాము రాసిన నవలల్లోని హీరోలెలా ఉంటారో - ఆ వర్ణనలకు అనుగుణంగా తన ప్రియుడు ఉంటాడని మధురోహలలో తేలిపోయింది. సినిమాలలో హీరోలెలా ఉంటారో భావించుకుని నందనవనాల్లో డ్యూయెట్లు పాడింది. చివరికి ఆమె మాతృమూర్తి కాబోతుందని తెలియగానే - సూర్యుడు కుంతికి వరమిచ్చి అంతర్ధానమైనట్లు ఆమెను వదిలి అతను కూడా అంతర్ధానమయ్యాడు! ఆత్మహత్యే శరణ్యమని ఆమె నిర్ణయానికి రాగానే, నేనామెను వివాహం చేసుకుని ఈ తండ్రిలేని శిశువుకి తండ్రినయ్యాను. ఆమెను మోసగించిన ద్రోహికి ఎటువంటి శిక్ష విధించాలో మీరే చెప్పండి!"

"ఉరిశిక్ష" అన్నారు తోడి ప్రయాణికులు ముక్తకంఠంతో, పళ్లు పటపట కొరుకుతూ, నేను కూడా శ్రుతికలిపాను ఆక్రోశంతో పిడికిలి బిగిస్తూ.

"ఇంతకీ ఈ పాప తల్లిది ఏ ఊరో, ఏ పేరో చెప్పారు కారు?" అన్నారు తోడిప్రయాణికులు ప్రశ్నార్థకంగా.

"సుభాషిణి. పొడగట్లపల్లి గ్రామం" అన్నాడు ఆ మధురవచస్వి.

విజయవాడ వచ్చింది. తోడి ప్రయాణికుల దగ్గర సెలవు తీసుకుని దిగిపోయాను.

ఆ పొడగట్లపల్లి సుభాషిణిని వంచించిన ద్రోహికి ఉరిశిక్ష విధించాలని తోడి ప్రయాణికులతో పిడికిళ్లు బిగించిన నేనే ఉరిపోసుకు చావవలసింది. కానీ జీవచ్ఛవంలా బతుకు వెళ్లదీస్తున్నాను.

ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 7 డిసెంబరు 1998